క్లుప్తంగా

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగించి, విశేష పూజాకార్యక్రమాలు చేపట్టారు. సుమారు 24 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

విభిన్న ప్రతిభావంతులకు స్పెషల్‌డ్రైవ్

శ్రీశైలంప్రాజెక్ట్: మండలంలో విభిన్న ప్రతిభా వంతులకు ఆదివారం సున్నిపెంటలోని సచివాలయం -2 లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం నుంచి అందే ఉపకరణాలకు అర్హులైన వారు అర్జీలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నిస్వార్థ రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. శనివారం లోకేష్ ఆత్మకూరులోని బహిరంగ సభలో శిల్పా చక్రపాణిరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్ మాట్లాడుతూ శిల్పాపై చేసిన ఆరోపణలకు రుజువులు చూపాలని లోకేష్‌కు సవాల్ విసిరారు.

మహానందిలో భక్తుల రద్దీ


మహానంది ఆలయ ప్రాంగణంలో భక్తులరద్దీ

మహానంది: వేసవిసెలవులు, ఆదివారం, పెళ్లిళ్లు ఉండటంతో మహానంది ఆలయం భక్తజనంతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా కనిపించాయి. ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం రాత్రి వరకు నిరిర్విరామంగా కొనసాగింది. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని నెలరోజుల పాటు నిర్విరామంగా దర్శనం సౌకర్యం కల్పిస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

ఓంకారంలో భక్తజన సందడి


మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ ఓంకారసిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. చిన్నారులు, పెద్దలు పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారి దర్శనం అనంతరం మెట్లమార్గం మీదుగా వెళ్లిన భక్తులు ఏకశిలా రూపంలో ఉన్న శ్రీ పద్మావతీ, వెంకటేశ్వరస్వామిని సందర్శించారు. కాశిరెడ్డినాయన అన్నదాన భవనంలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం


నృత్యం చేస్తున్న కళాకారిణి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళా వేదికపై కువైట్‌కు చెందిన అనన్య సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. మహాగణపతిం, శివశంకర, నమఃశివాయతే, భో..శంభో, తదితర గీతాలకు నృత్యం చేశారు.

ఒకే రోజు రెండు గుడ్లు..


ఒకేరోజు కోడి పెట్టిన పెద్ద గుడ్డు, చిన్న గుడ్డు

మహానంది: కోడిపెట్ట రోజుకు ఒక గుడ్డు పెట్టడం, ఒక రోజు పెద్ద సైజులో ఉంటే మరో సందర్భంలో జన్యుపరమైన లోపాల వల్ల చిన్నగుడ్డు పెట్టడం చూస్తుంటాము. అయితే ఒకే రోజు ఓ గుడ్డు పొడవుగా, మరో గుడ్డు గోలీ సైజులో ఉండటం విశేషం. అబ్బీపురం గ్రామానికి చెందిన నాగమ్మ పెంచుకుంటున్న కోళ్లలో ఓ కోడిపెట్ట ఇలా ఒకే రోజు రెండు రకాలుగా గుడ్లు పెట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది.

17న బహిరంగ వేలం

శిరివెళ్ల: యర్రగుంట్లలోని ఆలయాలకు చెందిన మాన్యం కౌలుకు ఈ నెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసయ్య ఆదివారం తెలిపా రు. రామస్వామి ఆలయానికి చెందిన 21.16 ఎకరాలు, ఈశ్వరస్వామి 22.24 ఎకరాలు, కేశవస్వామి ఆలయానికి చెందిన 25 ఎకరాల భూములు వేలం వేస్తామని చెప్పారు. ఆలయాలకు బకాయిలున్నవారు పాటలకు అనర్హులని పేర్కొన్నారు.

జోరుగా వేసవి దుక్కులు

- ఆర్‌బీకేలు, సొసైటీలకు చేరుకుంటున్న ఎరువులు, మందులు
- ముందస్తుగా రైతులకు అందుబాటులో ఎరువులు
- ఆర్‌బీకేలలో విత్తనాలు సిద్ధంగా ఉంచిన ప్రభుత్వం
- నాగళ్లతో దుక్కి దున్నితే మేలంటున్న వ్యవసాయాధికారులు


పాములపాడు సమీపంలో వేసవి దుక్కులు దున్నిన దృశ్యం


10 బొల్లవరం సొసైటీలో ఎరువులను దించుతున్న దృశ్యం

నందికొట్కూరు: ఈ సారి మే మొదటి వారంలోనే నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో అన్నదాతలు నాగళ్లతో దుక్కి దున్నుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు భూములను సిద్ధం చేసేందుకు వేసవి దుక్కులు చేస్తున్నారు. ఇప్పటికే గత పంట అవశేషాలను తొలగించి, వేసవి దుక్కులు కూడా దాదాపుగా పూర్తి చేస్తున్నారు. వర్షాలు కొనసాగితే ఈనెల చివరి వారం, లేదా జూన్ తొలి వారంలోనే పంటలు సాగు చేసే అవకాశముంది.

ఎరువులు, విత్తనాలు సిద్ధం..

ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఈ ప్రాంత రైతులు పంటలు సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం చేరవేయడం ప్రారంభించింది. ఇప్పటికే గ్రామాల్లోని ఆర్బీకేలతో పాటు సొసైటీలకు కూడా ఎరువులు, మందులు చేరుతున్నాయి. రైతులకు అవసరమైనన్ని, వారికి తక్కువ కాకుండా ఉండేలా చర్యలు చేపట్టింది. యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది.

వేసవి దుక్కులతో లాభం..

భూమి పైభాగం ఆరిపోయిన లోపలభాగం తేమతో ఉంటుంది. అదే ట్రాక్టరు నాగళ్లతో దుక్కి దున్నడం వల్ల నేల సుమారు రెండు అడుగుల మేర తిరగబడి లోపలిభాగం పైకి వస్తుంది. ఆ విధంగా లోపల పంటకు హాని చేసే పురుగులు బయటపడి నశిస్తాయి. ముఖ్యంగా పంటలో కాండం కుళ్లు తెగుళ్లకు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలలో ఉండటం వల్ల వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంటను నాశనం చేస్తాయి. వేసవి దుక్కులు దున్నడం వల్ల లార్వాలు నశించి పోతాయి. అలాగే మొండిజాతికి చెందిన గడ్డి మొక్కలు, కలుపు మొక్కల మూలాలు ఎండకు ఎండిపోయి వాటి సమస్య తగ్గడంతో పాటు దుమ్ములో కుళ్లి భూమి సారవంతమవుతుంది. వాలుకు అడ్డంగా దున్నడం వల్ల వర్షపు నీరు ముందుకు పారిపోకుండా భూమిలోకి ఇంకిపోతుంది.

గతేడాది కన్నా ఎక్కువ సాగు..

గత ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న పంటను అధికంగా సాగు చేశారు. ఈ ఏడాది కూడా మొక్కజొన్న పంటను అత్యధికంగా సాగు చేసే అవకాశముంది. మొక్కజొన్నతో పాటూ పెసర, మినుము, పత్తి, పట్టు, కొర్ర, కంది పంటలు వేయనున్నారు. ఆత్మకూరు మండలంలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 3,205 ఎకరాలకు గానూ.. గత ఏడాది 4,910.5 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 5 వేల ఎకరాలకు పైగానే సాగు చేయనున్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో సాధారణంగా 10,229 ఎకరాల్లో మొక్కజొన్న పంటను స్థానిక రైతులు సాగు చేయాల్సి ఉంది. అయితే రికార్డు స్థాయిలో గత ఏడాది 17,186 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ ఏడాది 18వేల ఎకరాలకు పైగానే సాగయ్యే అవకాశముందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మెట్ట వరి.. ఆత్మకూరు మండలంలో 2,324 ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉండగా 2,191 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఆత్మకూరు డివిజన్‌లో మినుము సాధారణ సాగు విస్తీర్ణం 772 ఎకరాలకు గాను 304 ఎకరాల్లో సాగు చేశారు.

ఆత్మకూరు: ఖరీఫ్ పంట సాగుకు పొలాలను సిద్ధం చేసేందుకు రైతన్నలు వేసవిదుక్కుల్లో బిజీ బిజీగా ఉన్నారు. ఏప్రిల్‌తో పాటు ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు పొలాలు పదునెక్కాయి. ఇప్పటికే రబీ పంటల వ్యర్థాలను తొలగించి లోతు దుక్కులు చేస్తున్నారు. బుధవారం ఆత్మకూరు డివిజన్‌లో 14.6 మి.మీ వర్షం కురవడంతో పలు మండలాల్లో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం దుక్కులు దున్నడం, పశువుల ఎరువులు చల్లించడం, గట్లు సరిచేసుకోవడం పనులు చేస్తున్నారు. మే నెలలో సాధారణ వర్షపాతం 29 మి.మీ, కాగా.. రికార్డు స్థాయిలో 69 మి.మీ. వర్షం కురిసింది. వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఆత్మకూరు కంటే ఎక్కువ వర్షం కురిసింది.


ట్రాక్టర్‌తో పొలంలోదుక్కుదున్నుతున్న రైతులు

దుక్కులతో భూమి సారవంతమవుతుంది

వేసవి దుక్కులతో పంటలకు తెగుళ్లు తగ్గుతాయి. ఫలితంగా రైతులకు ఖర్చు తగ్గుతుంది. అంతేకాక భూమి సారవంతంగా మారుతుంది. పంటలు అత్యధికంగా దిగుబడులు సాధించవచ్చు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల ఎరువులు, విత్తనాలు ఉన్నాయి.

– అంజనేయులు ఏడీఏ, ఆత్మకూరు

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మహానంది: గాజులపల్లె గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొంటారని అధికారులు ఆదివారం తెలిపారు. మజరా గ్రామాలైన చదరంపెంట గూడెం, పాలెంచెరువు గూడెం, ఎర్రకుంట గూడెం, బండినాయిని పాలెం గ్రామాలతో పాటు గువ్వల కుంట్లలో పర్యటిస్తారని చెప్పారు.

కేసు నమోదు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడ్యాలలో ఈనెల 12న జరిగిన దాడి కేసులో నిందితులైన కానిస్టేబుల్ అంబటి శివకృష్ణ, తండ్రి అంబటి శేషన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన అంబటి శ్రీనుపై తండ్రీ కొడుకులు దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. బాధితుడు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని చెప్పారు.

శాఖాహారంతో ఆరోగ్యం

నందికొట్కూరు: శాఖాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిదని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర కళ్యాణ మండపం, రాజావీధి, చౌడేశ్వరిదేవి ఆలయం, సాయిబాబాపేట, బసిరెడ్డి కళాశాల, పంచముఖి వినాయక గుడి, సంగయ్యపేట, శాంతిటాకీస్, పటేల్ సెంటర్ కూడలి తదితర ప్రాంతాల్లో మాంస ఆహారం వద్దు శాకాహారం ముద్దు అంటూ అవగాహన కల్పించారు.ఆర్యవైశ్య సంఘం నాయకులు అలువాల రామూర్తి, వీఆర్ శ్రీనివాసులు, కౌన్సిలరు లాలు ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేత మిడుతూరు


ప్రథమ బహుమతిని అందజేస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో మిడుతూరు ఏబీఎం జట్టు విజేతగా నిలిచి రూ.30 వేల నగదును సొంతం చేసుకుంది. గడివేముల జట్టు రెండో స్థానంలో నిలిచి రూ. 20 వేలు, వనములపాడు జట్టు మూడో స్థానంలో నిలిచి రూ. 10 వేలు, నాగలూటి జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ. 5 వేలు నగదును బహుమతుల దాతల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 40 జట్లు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. విజేత జట్టుకు గ్రామ ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి ఆదివారం బహుమతి అందజేశారు. నాయకులు తువ్వా రామనాగేశ్వరరెడ్డి, మల్లికార్జున రెడ్డి, నిర్వహకులు పాల్గొన్నారు.

కుంభాభిషేక ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ రాజగోపురాలు, విమానగోపురాలకు పరంజా ఏర్పాటు చేశారు. కుంభాభిషేకం సమయంలో గోపుర శిఖరాలకు అభిషేకం జరిపేందుకు వీలుగా పరంజా ఏర్పాటు చేస్తారు. దేవస్థానం ఈఓ ఎస్ లవన్న పరంజా ఏర్పాట్లును ఆదివారం పరిశీలించారు. అన్ని గోపురాలకు సకాలంలో పరంజా ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న యాగశాల, హోమగుండం నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, ఎం.నరసింహారెడ్డి, సహాయ స్థపతి ఉమా వెంకట జవహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞానం


పిల్లలతో క్యారమ్స్, చెస్ ఆటలాడిస్తున్న దృశ్యం


చిన్నారులకు నేర్పించి వేయించిన చిత్రాలు


పుస్తకపఠనంపై ఆసక్తిని పెంచేలా చదివిస్తున్న దృశ్యం

మహానంది: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా వారికి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తూ కథలు, కథనాలు చెబుతూ, బొమ్మలు గీయిస్తూ, ఆటలాడిపిస్తూ కొత్తకొత్త విషయాలను నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తుందని తిమ్మాపురం గ్రంథాలయాధికారి ఎం.రవిరాజు ఆదివారం తెలిపారు.

కార్యక్రమాల వివరాలు ..

ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు జరిగే వేసవి విజ్ఞానశిబిరంలో రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తల్లిదండ్రుల ఇష్టంతో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి అరగంట పాటు కథలు చదివి వినిపించడం, వినగలిగే సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నారు. 8.30 గంటల నుంచి పది గంటల వరకు పుస్తకాలు చదవడం, పది నిమిషాలు విరామసమయం అనంతరం మరో అరగంట పుస్తకసమీక్ష, మరో అరగంట కథలు చెప్తూ చిన్నారులకు లోకజ్ఞానం నేర్పుతున్నారు. వీటితో పాటు ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, అతిథుల ప్రసంగాలు, బొమ్మలు తయారు చేయించే అంశాలను నేర్పిస్తున్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు అనేక అంశాలపై తర్ఫీదునిస్తున్నాం. సెలవులను సక్రమంగా వినియోగించుకునేలా చేయడం, చదివే అలవాటును పెంపొందిస్తున్నాం.పిల్లలు లైబ్రరీకి వచ్చేలా అలవాటు చేయడం ద్వారా ఇక్కడ లభించే ఎన్నో పుస్తకాలపై వారికి అవగాహన కలుగుతుంది. చదవడంపై ఆసక్తి పెరుగుతుంది. దీంతో అనేక అంశాలపై వారికి జ్ఞానం పెంపొందుతుంది. తద్వారా భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– యం.రవిరాజు, గ్రంథాలయాధికారి, తిమ్మాపురం

వేడుకగా హనుమాన్ జయంతి


భజన చేస్తున్న చిన్నారులు


తూడిచెర్లలో పూజలో పాల్గొన్న భక్తులు




అలంకరణలో సంజీవరాయ ఆంజనేయస్వామి,మహానందిలో,శ్రీశైలంలో పూజలు చేస్తున్న అర్చకులు

నందికొట్కూరు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వెలసిన అభయాంజనేయస్వామికి ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశేష పంచామృత అభిషేకములు, ఆకు పూజ, మండల పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల పూజలో భాగంగా నాగమయ్యలకు పాలతో అభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం వాసవి దళ్ ఆధ్వర్యంలో జరిగాయి.

మహానంది: హనుమాన్ జయంతి సందర్భంగా మహానంది ఆలయంలో కొలువైన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, హనుమంతశర్మ, ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ ఆంజనేయ స్వామిని విశేషంగా అలంకరించారు. తమలపాకులతో అర్చించి, వడమాలతో పూజలు చేపట్టారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎన్. ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించి భక్తులకు అన్నదానం చేపట్టారు. పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లోని వాల్మీకీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొత్త ముచ్చుమర్రిలో సీతారాముల ఉత్సమూర్తులను రథంపై కూర్చోబెట్టి రథోత్సవం జరిపించారు.ఈ సందర్భంగా నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

జూపాడుబంగ్లా: హనుమంతుని జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కనకయ్యకొట్టాల, 80బన్నూరు సమీపంలోని జూపాడు ఆంజనేయస్వామి ఆలయం, తాటిపాడు, తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిగ్రహాలకు పంచామృతాభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చనలతో పాటు దూపదీపనైవేద్యాలతో విశేషపూజలు నిర్వహించారు.

పాములపాడు: ఎర్రగూడూరు గ్రామ శివారులో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంజీవరాయ ఆంజనేయ స్వామికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ఆకుపూజ, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం కోలాట నృత్యం, మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని పాతాళగంగ మార్గంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వైశాఖ బహుళ దశమి హనుమజ్జయంతిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా అర్చక,వేదపండితులు పూజలు నిర్వహించారు. శ్రీమన్యుసూక్త పారాయణ సహిత అభిషేకము, నాగవల్లి దళార్చన, పుష్పార్చన, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు జరిపించారు. ఈఓ ఎస్ లవన్న, సహాయ కార్యనిర్వాహణాధికారి హరిదాసు పాల్గొన్నారు.

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవ రాయ స్వామి, చెరుకుచెర్ల సమీపంలో బాట ఆంజనేయ స్వామి, మిడుతూరు, పీరుసాహెబ్ పేట, సుంకేసుల, చౌట్కూరు తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

మహానంది కోనేరుల్లో యువకుల అల్లరి

మహానంది: క్షేత్రంలోని కోనేరుల వద్ద యువకులు హల్‌చల్ చేశారు. కోనేరుల్లో స్నానం చేస్తున్న భక్తులకు అసౌకర్యం కలిగించడమే కాకుండా అల్లరికి పాల్పడిన యువకులను దేవస్థానం ఉద్యోగులు అల్లరి చేయొద్దని సూచించగా వారిపై దాడికి యత్నించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. నంద్యాలకు చెందిన కొందరు యువకులు మహానందికి వచ్చారు. స్థానిక కోనేరులో స్నానం చేస్తూ అల్లరి చేస్తున్న విషయాన్ని గమనించిన ఉద్యోగి నాగరాజు, మరికొందరు అల్లరి చేయొద్దంటూ సూచించేందుకు వెళ్లగా వాగ్వాదానికి దిగి దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నంద్యాల జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో వెలుగోడు, ఆత్మకూరు, శిరివెళ్ల, కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ సొసైటీల జట్లు పాల్గొన్నారు. విజేతగా నంద్యాల టీం గెలుపొంది రూ.15వేలు దక్కించుకుంది. రన్నరప్‌గా వెలుగోడు టీం రూ.10వేలు దక్కించుకోగా మూడో స్థానంలో కోవెలకుంట్ల సొసైటీ టీం నిలిచి రూ.5వేలు అందుకుంది.


ట్రోఫీ అందుకుంటున్న నంద్యాల సొసైటీ సహకార బ్యాంక్ యూనియన్ ఉద్యోగులు

ఇక్కడ బస్సులు ఆపండి సారూ!


బస్సులు నిలపకపోవటంతో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

జూపాడుబంగ్లా : స్థానిక ఆర్టీసి బస్టాండ్‌లో బస్సులు నిలపకపోతుండటంతో భవనం నిరుపయోగంగా మారింది. 25 ఏళ్ల క్రితం జూపాడుబంగ్లాలో ఆర్టీసి బస్టాండ్ నిర్మించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం వివిధ ప్రాంతాలకు వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండులో బస్సులు నిలుపుకొని ప్రయాణికులను ఎక్కించుకొనే వెసలుబాటు ఉన్నప్పటికీ బస్సులు నిలపటం లేదు. దీంతో ఆర్టీసీ బస్టాండు కాస్త యాచకులకు నిలయంగా మారింది. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాలనుకొనే ప్రయాణికులు ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాలకు వెళ్లి అక్కడి నుంచి వెళ్తున్నారు. సమీపంలోని నందికొట్కూరు, ఆత్మకూరు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కూడా అక్కడ నిలపకపోవటంతో దూర డిపోలకు చెందిన బస్సులను నిలపడం లేదు. దీంతో ప్రయాణికులు కేజీ రహదారిపై బస్సుల కోసం వేచిచూడాలివస్తోంది. ఈ విషయమై ప్రతి సర్వసభ్య సమావేశంలో అధికారులు, సభ్యులు తీర్మాణం చేసి ఆర్టీసి అధికారులకు పంపినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూటూరు గ్రామం శ్రీశైలం నీటి ముంపుకు గురైంది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా మైదానంగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం తవ్వకాలు జరిపిన ప్రాంతంలో గతంలో పురాతన ఆలయం ఉండేది. గుడి ఉన్న ప్రాంతంలో రాయిపై శిల్పం ఉన్న బండను పక్కకు తొలగించి రెండు చోట్ల తవ్వకాలు చేపట్టారు. కాగా తవ్వకాలు జేసీబీతో చేపట్టినట్లు తెలుస్తోంది.


గుప్త నిధుల కోసం తవ్విన దృశ్యం